బోర్డులు సరే.. సమాచారమేది?

- యార్డులో కానరాని టమాటా ధరలు
- ఖాళీగా దర్శనమిస్తున్న ధరల సమాచార బోర్డులు

గుర్రంకొండ: గుర్రంకొండ మార్కెట్‌యార్డులో టమాటాధరలను సూచించే సమాచార బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంతాల మార్కెట్‌యార్డుల్లో ఎంతమేరకు టమాటా ధరలు ఉన్నాయో ప్రతిరోజు నమోదు చేయాల్సి ఉంది. అయితే బోర్డుల్లో ఎలాంటి ధరల సమాచారం లేక పోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

స్థానిక మార్కెట్ యార్డులోని వివిధ మార్కెట్లలో టమాటా ధరలను సూచించే బోర్డుల్లో సమాచారమే కరువైంది. సాధారణ బ్లాక్ బోర్డుతోపాటు కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులో కూడా ధరల సమాచారం కనిపించడం లేదు. ప్రతి రోజూ మార్కెట్ యార్డులో టమాటాల వేలం పాటలు నిర్వహించే సమయానికి వివిధ పట్టణాల్లోని మార్కెట్‌యార్డుల్లో టామాటా ధరలు ఎంతమేరకు ఉన్నాయో ఆయా బోర్డుల్లో సమాచారం ఉంచేవారు. రైతులు ముందుగానే వచ్చి ఆరోజు టామాటా ధరలపై ఒక అంచనాకు వచ్చేవారు. అయితే కొన్ని రోజులుగా రెండు బోర్డుల్లో సమాచారం కరువైందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అధికారులు స్పందించాలి

మదనపల్లె, కలికిరి మార్కెటయార్డుల్లోని టమాటా ధరలను, డిజిటల్ బోర్డులో చుట్టుపక్కల ఉన్న మరిన్ని పట్టణాల్లోని యార్డుల్లో ఆయా రోజుల్లో ఉన్న ధరలను చూపించేవారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో సాయంకాలం 4 గంటల నుంచి టమాటాల వేలం పాటలు ప్రారంభమవుతుంటాయి. అయితే అప్పటికే చుట్టుపక్కల ఉన్న పలు పట్టణాల్లోని యార్డుల్లో టమాటా వేలం పాటలు ముగిసిపోయి ధరలు తెలిసిపోతుంటాయి. దీంతో గుర్రంకొండ యార్డులో సాయంకాలాన్ని కల్లా అన్ని మార్కెట్లలోని టమాటా ధరలు వేలం పాటల కంటే ముందే ప్రకటించేవారు. చాలా రోజులు ఈ తతంగం జరగడం లేదు. దీంతో యార్డులో సమాచార బోర్డులు కేవలం దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే బోర్డుల్లో సమాచారం పొందుపరచాలని కోరుతున్నారు.



మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన బోర్డులో టమాటా ధరల సమాచారం లేని దృశ్యం

సమాచారం అందుబాటులో ఉంచుతాం



యార్డులోని సమాచార బోర్డుల్లో టమాటా ధరలను రైతులకు అందుబాటులో ఉంచుతాం. యార్డులో రెండుచోట్ల ధరల సమాచార బోర్డులు ఏర్పాటు చేశాం. కార్యాలయం వద్ద డిజిటల్ సమాచార బోర్డులు ఉంచాం. అయితే కొన్ని నెలలుగా అవి వినియోగంలోకి రావడం లేదు. ఇక నుంచి సమాచారం రోజు బోర్డుల్లో ఉంచుతాం.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

మండల అభివృద్ధికి సమష్టి కృషి అవసరం

కేవీపల్లె : మండల అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని ఎంపీపీ ఈశ్వరమ్మ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి సరైన ప్రణాళికలు రూపొందించాలని కోరారు. అనంతరం 'సంకల్ప' జెండర్ సెన్సిటైజేషన్ అవేర్‌నెస్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ మాట్లాడుతూ స్త్రీ, పురుషులు ఇరువురు నిత్య జీవితంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో సమాన భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీవో సుధాకర్, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో తాగునీటి బోరు

పెద్దమండ్యం : మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెలో రాజంపేట ఎంపీ పి. మిథున్‌రెడ్డి నిధులతో తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులను గురువారం మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్ ప్రారంభించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సహకారంతో తురకపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 2 లక్షల నిధులను కేటాయించినట్లు గ్రామ సర్పంచ్ మొలక బయ్యారెడ్డి తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కడైనా తలెత్తిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మొలక సాంబశివారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మొఘల్ చాంద్‌బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.


తాగునీటి బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక


ఆంజనేయులు


వేషాల ప్రకాష్


నాగలక్ష్మి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీ గుడ్డంపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసే ఆంజినేయులు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైనట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. విధుల నిర్వహణలో అంకితభావం, దాతలు ఇచ్చిన సాయంతో పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధికి చేసిన కృషి, సామాజిక సేవలను గుర్తించి ఉత్తమ టీచర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

కలికిరి(వాల్మీకిపురం) : కలికిరి పట్టణం బ్రాహ్మణ వీధికి చెందిన ప్రధానోపాధ్యాయుడు వేషాల ప్రకాష్ వాల్మీకిపురం మండలం మంచూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన సేవలకు గాను జిల్లా స్థాయి ఉత్తమ ప్రధానోపాధ్యాయుడుగా ఎంపికయ్యాడు. శుక్రవారం జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగే సమావేశంలో జిల్లా కలెక్టర్, డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

కురబలకోట : అన్నమయ్య జిల్లాలో బెస్ట్ హెడ్ మాస్టర్‌గా మండలంలోని అంగళ్లు జెడ్పీ హైస్కూల్ హెడ్ మాస్టర్ సుండుపల్లి నాగలక్ష్మి ఎంపికయ్యారు. ఈమె 2021 నుంచి హెడ్ మాస్టర్‌గా ఉన్నారు. ఆమె వచ్చినప్పటి నుంచి హైస్కూల్ స్థితిగతులు మార్చారు. ముఖ్యంగా పదో తరగతి ఫలితాల్లో మండలంలో ఫస్ట్ ప్లేస్‌లో వచ్చేలా చేశారు. ఈసారి కూడా మండలంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి రికార్డు సృష్టించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే పది ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిపారు. అంతేగాకుండా మండలంలో ఈ హైస్కూల్ నుంచే ఎక్కువ మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఆమె వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వడం విశేషం. బోధన, ఉత్తమ విద్యా విధానాలు, ప్రమాణాల మెరుగు, ప్రత్యేక తరగతులు, టెస్టులు, అభ్యసనం, హైస్కూల్ నిర్వహణ, మధ్యాహ్న భోజనం, విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీయడంలో టీచర్ల సహకారంతో కీలక పాత్ర వహించారు. ప్రస్తుతం 506 మంది విద్యార్థులు ఉన్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని నాగలక్ష్మిని జిల్లాలో ఉత్తమ హెడ్మాస్టర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

ప్రజాస్వామ్య రక్షణే లక్ష్యంగా పోస్టుకార్డు ఉద్యమం

పీలేరు : ప్రజాస్వామ్య రక్షణే లక్ష్యంగా పోస్టుకార్డు ఉద్యమం చేపట్టినట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ అన్నారు. గురువారం పీలేరు పట్టణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత పవిత్రమైందని తెలిపారు.అయితే నకిలీ ఓటర్ల ద్వారా జరుగుతున్న ఓటు చోరీ ప్రజా స్వామ్యాన్ని దెబ్బతీస్తోందని తెలిపారు. ఓట్ చోర్ అరికట్టడానికి రాష్ట్రపతి జోక్యం చేసుకుని డిజిటల్ ఓటరు జాబితా ప్రచురించడంతోపాటు ఓట్ చోర్ అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు సాయిసంపత్, లోకేష్, యశ్వంత్, మహేంద్ర, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

పెద్దతిప్పసముద్రం : నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్థానిక మెడికల్ అధికారి డాక్టర్ ఎండీ యస్థాని అన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యమ్మ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో బేటీ బచావో - బేటీ పడావో మిషన్‌శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికా విద్య, గృహ హింస, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో లింగ వివక్ష చూపరాదని హితబోధ చేశారు. కార్యక్రమంలో జిల్లా సైకాలజీ కౌన్సిలర్ ఫీమా అంజూమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హిజాద్ ప్యారి, భవాని, రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సైకాలజీ కౌన్సిలర్ ఫీమా అంజూమ్

మహిళా సాధికారత కోసం సంకల్ప్ హబ్

మదనపల్లె రూరల్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం సంకల్ప్ హబ్ (హెచ్ ఈడబ్ల్యూ) పదిరోజుల ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ నాగవేణి తెలిపారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా గురువారం మదనపల్లె అర్బన్ విజయనగర్ కాలనీ, బసినికొండ–2 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగవేణి మాట్లాడుతూ...సెప్టెంబర్ 2 నుంచి 12వ తేదీ వరకు పదిరోజుల పాటు లింగ సమానత్వం, పునరుత్పత్తి ఆరోగ్యం, కిషోరబాలికల ఆరోగ్యం, చిన్నపిల్లలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్వేత, కళావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు, ప్రజలు హాజరయ్యారు.


మాట్లాడుతున్న సీడీపీఓ నాగవేణి

బాలికలే సమాజానికి వెలుగు


బి.కొత్తకోట: మాట్లాడుతున్న భాగ్యమ్మ


కలకడ : మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్


పీలేరు : మాట్లాడుతున్న స్వరూప

బి.కొత్తకోట : బాలికలే సమాజానికి వెలుగని ఐసీడీఎస్ మండల సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో లింగ సమానత్వంపై సంకల్ప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు ఉన్నప్పుడే లింగ నిష్పత్తిలో వ్యత్యాసం ఉండదన్నారు. గర్భంలో ఆడశిశువు ఉంటే వద్దనుకోవడం తప్పని అన్నారు. బాలికలను కాపాడుకోవడం, పుట్టబోయే ఆడబిడ్డను బాలురతో సమానంగా చూడటం అవసరమన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. చదువుకున్న బాలికలు ఇంటికి, సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. బాలికలను చదవనివ్వడం, వారికి పురుషులతో సమానంగా అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ జయరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలకడ : నేటి బాలలే-రేపటిపౌరులని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. గురువారం కలకడ వెలుగు కార్యాలయంలో భేటీ బచావో-బేటీపఢావో కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్యకు పునాది కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ సిబ్బందిని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అందుకు సహకరించినవారు శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్.రాజమ్మ, ఏఎస్‌యం రాజేశ్వరి, సూపర్‌వైజర్లు శాంత, యశోద పాల్గొన్నారు.

ఆడపిల్లలు ఉన్నతంగా రాణించాలి

పీలేరు : ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. గురువారం పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి తీసుకురావాలన్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు, ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సరస్వతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమా, అక్కయ్యమ్మ, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో గురువారం వినాయక నిమజ్జన వేడుకలు కోలాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన వినాయవిగ్రహానికి పూజలు చేసి ట్రాక్టర్‌లో ప్రత్యేక అలంకరణ చేసి ఊరేగింపు నిర్వహించారు. పట్టణ సమీపంలోని తట్టివారిపల్లెచెరువులో నిమజ్జనం చేశారు. వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : రామసముద్రం మండల కేంద్రంలోని అంజనేయస్వామి కాలనీ, ఎగువపాళ్యంలో వినాయకుని విగ్రహాన్ని గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. వినాయక చవితి సందర్భంగా 9వ రోజు వినాయకుని నిమజ్జనాలు యువకులు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు.

వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో..

కురబలకోట : వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో అంగళ్లుకు చెందిన యువ నాయకులు ఎస్‌బీఆర్ (శెట్టి భానుప్రకాష్) సహకారంతో గురువారం ఘనంగా గణనాధుని నిమజ్జనం నిర్వహించారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ మండల నాయకులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, కురబలకోట రాజశేఖర్ ప్రత్యేక పూజలు జరిపారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐక్యతతో జరుపుకునే పండుగలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. నిమజ్జన కార్యక్రమం ఉత్సాహంగా సందడిగా సాగింది.


ఊరేగింపులో వినాయకుని విగ్రహం


అంగళ్లులో ఎస్‌బీఆర్ ఆధ్వర్యంలో ..


రామసముద్రంలో వినాయక నిమజ్జన ఊరేగింపులో భక్తజనం

7న టౌన్‌బ్యాంకు మహాజన సభ

మదనపల్లె : ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ వార్షిక మహాజన సభ ఈ నెల 7న బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు బ్యాంకు సీఈఓ పీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సర వార్షిక, ఆడిట్ నివేదికలు, ఏ తరగతి సభ్యులను చేర్చుకోవడం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. బ్యాంకు కార్యకలాపాలను పొరుగు జిల్లాల్లో విస్తరించడంపైనా సభ్యుల నుంచి ఆమోదం కోరుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం



గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు పంచాయతీ ఎల్లారెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు విఠలం గంగిరెడ్డి కుమారుడు భవీన్‌కుమార్‌రెడ్డిల వివాహానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి వివాహం వాల్మీకిపురంలోని టీటీడీ కల్యాణమండపంలో గురువారం జరిగింది.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న సభ్యులు

బి.కొత్తకోట : స్థానిక బెంగళూరు రోడ్డులో యూత్ అసోసియేషన్ సభ్యులు వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడికి వచ్చే భక్తుల కోసం గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రోజంతా కార్యక్రమం నిర్వహించడంతో పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సభ్యులు విశ్వనాథ్, వినయ్, సునీల్, లోకేష్, శశి పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని ఆనంద వృద్ధాశ్రమంలో గురువారం హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు అన్నదానం చేశారు. హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్ధిక్ కుమార్తె రాబియా అంజుమ్ జన్మదినం పురస్కరించుకుని అన్నదానం చేశారు. వృద్ధులకు పండ్లు పెంచి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు ఆనందన్, కవితారాణి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు పవిత్రాల సమర్పణ


పవిత్రాలతో అర్చకులు

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో స్వామి వారికి మూడు రోజులుగా పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, రమేష్‌లు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామికి యాగశాల, పూర్ణాహుతి కార్యక్రమాలతో పవిత్రాలను సమర్పించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓలు వరలక్ష్మి, శివప్రసాద్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దుష్యంత్‌కుమార్, నగేష్, భక్తులు పాల్గొన్నారు.

ప్రవక్త మార్గంలో నడవాలి


ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట : ప్రతి ముస్లిం మొహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం ముస్లింలు పవిత్రంగా జరుపుకునే మొహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త బోధించిన శాంతి, కరుణ, సమాజ స్ఫూర్తిని అనుక్షణం గుర్తు చేసుకుంటూ వారు చూపిన మార్గంలో నడవాలన్నారు. మిలాద్ ప్రార్థనల్లో సమాజం సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రతి ముస్లిం ప్రార్థించాలని కోరారు.

నిరంతర అభ్యాసంతో ఉత్తమ కెరీర్


మాట్లాడుతున్న దినకర్ రెడ్డి

కురబలకోట : పోటీ ప్రపంచంలో నిరంతర అభ్యాసంతో ఉత్తమ కెరీర్ నిర్మాణం సాధ్యం కాగలదని ఐసీటీ హైదరాబాదు అకాడమీ రాష్ట్ర అధిపతి డాక్టర్ దినకర్ రెడ్డి సూచించారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో నూతన ఎంసీఏ, ఎంబీఏ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ నూతన టెక్నాలజీతో పాటు నూతన నైపుణ్యాల సాధన అవసరమన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఐటీ, ఏఐ రంగంలో విద్యార్థులకు అపారమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


వృద్ధుడిని పరీక్షిస్తున్న వైద్యులు

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల తెలుగు ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్ సిద్దిక్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మదనపల్లెకు చెందిన ఇషి కంటి ఆసుపత్రి వైద్యులు కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులను పంపిణీ చేశారు. తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా సొంత ఊరిలో తనవంతుగా వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు అబూబకర్ సిద్దిక్ తెలిపారు. డాక్టర్ సునీల్‌కుమార్, హెచ్‌ఎం మీనా నాగలక్ష్మి పాల్గొన్నారు.

సంతాపం

గుర్రంకొండ : మండలంలోని మర్రిపాడు గ్రామకస్వాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుల్తాన్ భార్య ముంతాజ్ మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. ఈమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గత బుధవారం మృతి చెందింది. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నీళ్లభాస్కర్, గ్రామకమిటి అధ్యక్షులు నారాయణరెడ్డి, నాయకులు విజయ్, మల్లి, షఫీవుల్లా, ఖాదురు, అమీర్‌భాషా, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మదనపల్లె : వైఎస్సార్‌సీపీ నాయకులు మృతికి ఆ పార్టీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్ నివాళులర్పించారు. మదనపల్లె రూరల్ మండలంలోని వేంపల్లె పంచాయతీ జంగాలపల్లికి చెందిన నాయకులు నారాయణ (70) మృతి చెందారు. గురువారం మృతదేహానికి నిసార్ అహ్మద్ నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

సన్మానం


రవిప్రకాష్, వెంకటేశ్వరప్రసాద్‌లను సన్మానిస్తున్న న్యాయవాదులు

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోషియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్షుడు మోడెం రవిప్రకాష్, జనరల్ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వరప్రసాద్‌లను గురువారం పీలేరు న్యాయవాదులు ప్రవీణ్‌కుమార్, మొహమ్మద్ అలీలు కలిసి సన్మానించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నూతన అధ్యక్ష, కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వాల్మీకిపురం కోర్టు న్యాయవాదులు విభాకర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆనందకుమార్, లక్ష్మీనరసింహయ్య, మహిత, విశ్వనాథ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం


పంచాలమర్రి పాఠశాలలో గురుపూజోత్సవం చేస్తున్న విద్యార్థులు

తంబళ్లపల్లె : మండలంలో అన్ని పాఠశాలల్లోనూ గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ముందస్తు గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులు గురువులకు పాదపూజ చేసి ఆశీస్సులు పొందారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక ఉపాధ్యాయుడిగా మొదలై భారత రాష్ట్రపతి స్థాయికి ఎదిగి భారతరత్న బిరుదు అందుకున్నారని ఉపాధ్యాయులు వివరించారు. ఆ మహోన్నత వ్యక్తి ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ డైవర్షన్

మదనపల్లె రూరల్ : పట్టణంలోని కదిరిరోడ్డు జడ్జి బంగళా పక్కన సితార షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు హాజరవుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నట్లు సీఐ గురునాథ్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ... శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనంతపురం, కడప మార్గంలో వెళ్లే బస్సులు గొల్లపల్లె మినీ బైపాస్‌రోడ్డు, చౌడేశ్వరి కల్యాణమండపం మీదుగా వెళతాయన్నారు. అటునుంచి వచ్చే బస్సులు అదే మార్గంలో ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంటాయన్నారు. బెంగళూరు నుంచి కడప వెళ్లే భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా బీటీ కళాశాల గ్రౌండ్స్, కడప నుంచి బెంగళూరు వెళ్లే భారీ వాహనాలను అమ్మచెరువుమిట్ట వద్ద నిలిపివేయనున్నట్లు తెలిపారు.

7న చంద్రగ్రహణం

మదనపల్లె సిటీ : సంపూర్ణ చంద్రగ్రహణం ఈనెల 7వతేదీ ఏర్పడుతుందని ప్రముఖ పంచాగకర్త అత్తలూరి శివకుమార్‌శర్మ తెలిపారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమై 10.59 నిమిషాల వరకు ఉంటుందన్నారు. చంద్రగ్రహణం రోజున ఆలయాలను మూసివేస్తారని వివరించారు.

6న జల్సా-ఏ-మిలాద్-ఉన్-నబి

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరు బస్టాండు వద్దనున్న బడేమకాన్‌లోని దర్గాలో శనివారం జల్సా-ఏ-మీలాద్-ఉన్-నబి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా మకాన్‌దార్ సయ్యద్‌హాషిం తెలిపారు. రాత్రి 9 గంటలకు దర్గా ఆవరణంలో ఆషారే షరీఫ్ (కేశ ప్రదర్శన) కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ అన్నారు. గురువారం చలో విజయవాడ పోస్టర్లను గురువారం ఎస్టీ హాస్టల్‌లో ఆవిష్కరించారు ఈ నెల 6న విజయవాడలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు,కాలేజీలో విద్యార్థి సంఘాలు అనుమతి లేదంటూ ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్‌లను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, గోవర్ధన్, శివకుమార్, జీవన్, నాయక్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.